# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక




4లో...

**ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా లోక్ సభ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత**

- గద్వాల జిల్లా ఎస్పీ రితిరాజ్


రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 303 | పేజీలు: 4 | వెల: 4/- | సోమవారం ● 13, మే 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


# తెలంగాణలో లోక్‌సభ సమరం

- 17 స్థానాలకు హోరాహోరీ పోటీ
- మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా సీట్లు
- డబుల్ డిజిట్‌పై కన్నేసిన కాంగ్రెస్, బిజెపి
- ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభం
- పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన సిబ్బంది
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన ఇసి



**హైదరాబాద్,మే12 (నమస్తే ఉదయం):** తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. సత్తా చాటాలని బిజెపి చూస్తోంది. 400 సీట్ల టార్గెట్‌లో కనీసం ఏడెనిమిది సీట్లు సాధించాలన్న పట్టుదలతో ప్రచారం నిర్వహించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం ఈ ఎన్నికల్లో విశేషం. అలాగే నడ్డా, అమిత్ షాతో పాటు ఇతర రాష్ట్రాల సిఎంలు కూడా ప్రచారంలో పాల్గొన్నారు. గత ఎన్నికల్లో తెలంగాణలో అనూహ్యంగా నాలుగు సీట్లు గెలుచుకున్న బీజేపీ ఇప్పుడు మెజారిటీ స్థానాలు కైవశం చేసుకోవడానికి ఉవ్విళ్లూరుతుండగా.. అధికార కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం నిలుపుకొనే ప్రయత్నం చేస్తోంది. ఈ పార్లమెంట్ ఎన్నికలు ప్రధానంగా సిఎం రేవంత్ రెడ్డికి ప్రతిష్మాత్మకం కానున్నాయి. గతంలో ఉన్న మూడు సీట్లను మించి సీట్లు సాధిస్తేనే ఆయన నాయకత్వంపై గురికుదురుతుంది. అలాగే మంత్రులకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గానికి మంత్రులు ఇన్‌ఛార్జులుగా ఉన్నారు. గతంలో ప్రాతినిధ్యం వహించిన రేంవత్ రెడ్డి, కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు మల్కాజిగిరి, భువనగిరి, నల్లగొండల్లో గెలుపు ముఖ్యం. అలాగే పాలమూరులోని రెండు సీట్లు కూడా సిఎం రేవంత్‌కు ప్రతిష్టాత్మకం కానున్నాయి. ఐదు నెలల క్రితం అధికారం కోల్పోయిన కేసీఆర్ ఒకటి రెండు స్థానాలైనా గెలుచుకొని పార్టీని కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో నాయకులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారు. లోక్‌సభ ఎన్నికలు తెలంగాణ భవిష్యత్ రాజకీయ ముఖచిత్రంపై ప్రభావం చూపనున్నందున మూడు ప్రధాన పార్టీలకూ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. సోమవారం జరగనున్న పోలింగ్‌లో తెలంగాణ ప్రజలు ఎవరిని ఆదరించబోతున్నారో, ఎవరిని తిరస్కరించబోతున్నారో తీర్పు ఇవ్వనున్నారు. శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయి ఐదు నెలలైనా వాస్తవంలోకి రాకుండా తెలంగాణను పాలించే సమర్థత తనకు మాత్రమే ఉందన్న భ్రమల్లో ఉన్న కేసీఆర్ 12 సీట్లు గెలిస్తే తానే ప్రధాని అంటూ బీరాలు పలికారు. బహిరంగ సభల్లో కూడా అదే విధంగా మాట్లాడారు. కేవలం ఐదు నెలల వ్యవధిలో తెలంగాణ రాష్ట్రం సర్వనాశనం అయిందని ప్రచారం చేయడం ఆయన అధికారం కోల్పోవడం తట్టుకోలేక పోయారని నిరూపిస్తోంది. తెలంగాణలో ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలకు కీలకం కానున్నాయి.

దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు మొత్తం ఏడు దశల్లో జరుగుతున్నాయి. ఆ క్రమంలో ఇప్పటి వరకు మూడు దశలో.. మొత్తం 285 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగింది. రేపు నాలుగో దశ పోలింగ్ జరుగుతుంది. ఇంకా మూడు దశలు మే 20, మే 25, జూన్ 1వ తేదీన జరగనున్నాయి. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు పక్రియ ప్రారంభం కానుందీ. అదే రోజు.. దేశంలోని ఓటరు ఏ పార్టీకి అధికారం కట్టబెడతాడనే విషయం స్పష్టం కానుంది. అలాగే ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సైతం అదే రోజు లెక్కించనున్నారు. దీంతో ఆ యా రాష్ట్రాల్లోని ఓటర్లు ఏ పార్టీకి పట్టం కట్టాడనేది సుస్పష్టం కానుంది. అలాగే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలోని మొత్తం 175 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మరోవైపు ఒడిశా అసెంబ్లీకి సైతం 4 దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ క్రమంలో మే 13వ తేదీన ఆ రాష్ట్ర అసెంబ్లీకి తొలి దశ పోలింగ్ జరగనుంది. జూన్ 1వ తేదీన జరిగే నాలుగో దశ పోలింగ్‌తో.. ఒడిశా అసెంబ్లీకి పోలింగ్ ముగియనుంది. ఇక లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి మాధవిలత, అసదుద్దీన్ ఓవైసీ, కరీంనగర్ నుంచి బండి సంజయ్, బిహార్‌లోని బిగుసరాయి నుంచి గిరిరాజ్ సింగ్, కడప నుంచి వైయస్ షర్మిల, జార్ఖండ్‌లోని ఖుంతి నుంచి అర్జున్ ముండా, బెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి శత్రుఘ్నసిన్హా, బెహరంపూర్ నుంచి యూసఫ్ పఠాన్, అధిర్ రంజన్ చౌదరి, రాజంపేట నుంచి ఎన్ కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు ఎన్నికల బరిలో నిలిచారు. తెలంగాణలో బండి సంజయ్, ధర్మపురి అర్వింద్ కిషన్ రెడ్డిలు మరోమారు పోటీ పడుతున్నారు. లోక్ సభ ఎన్నికలకు శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగిసింది. ఆ తరవాత తెలంగాణ రాష్ట్రంలో 144 సెక్షన్ అమలవుతోందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. 160 కేంద్ర కంపెనీల బలగాలు రాష్ట్రంలో ఇప్పటికే మోహరించాయని వివరించారు. ఇతర రాష్ట్రాల నుంచి 20 వేల పోలీస్ బలగాలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్‌లో రెండు బ్యాలెట్ యూనిట్లు ఉంటాయని వివరించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో 232 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వికాస్ రాజ్ స్పష్టం చేశారు. ఈవీఎంలు తరలించే వాహనాలకు జీపీఎస్ ఉంటుందని, వాటిని సీఈఓ ఆఫీస్ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తుందని సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. లక్ష 90 వేల మంది పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారని వివరించారు. వచ్చే 48 గంటల పాటు వచ్చే ఫిర్యాదులపై 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని వివరించారు. 21 వేల 680 మంది ఓటర్లు హోం ఓటింగ్ వేసుకున్నారని వికాస్ రాజ్ తెలిపారు. 328 పోలింగ్ కేంద్రాలను ఏజెన్సీ ఏరియాల్లో ఏర్పాటు చేశామని వెల్లడించారు. మూడు పోలింగ్ కేంద్రంలో అత్యల్ప ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికల సంఘం దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికల విధుల్లో 2.80 లక్షల మంది ఉద్యోగులు పాల్గొననున్నారు. రాష్ట్రంలో మొత్తం 3.32 కోట్ల మంది ఓటర్లు ఉండగా. ఇందులో సగానికి పైగా మహిళా ఓటర్లే ఉన్నారు. 17 పార్లమెంట్ నియోజకవర్గాలకుగాను 13 నియోజక వర్గాల్లో మహిళ ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల 809 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్లలో ఎండలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని సూచించింది ఎన్నికల సంఘం. 9,900 పోలింగ్ కేంద్రాలను

మిగతా.. 2లో

## స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి

- సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలపై కఠిన చర్యలు
- తెలంగాణ డిజిపి రవిగుప్తా స్పష్టీకరణ



**హైదరాబాద్,మే12(నమస్తే ఉదయం):** తెలంగాణలో సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీజీపీ రవి గుప్తా తెలిపారు. ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినిగించుకోవాలి డీజీపీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా కోసం ప్రత్యేక సైబర్ సెక్యూరిటీ వింగ్ ఏర్పాటు చేశాం. రాష్ట్ర సరిహద్దుల్లో పారామెలిటీ బలగాలతో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు డీజీపీ తెలిపారు. అలాగే ఎన్నికల్లో ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేశామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు 73,414 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 500 తెలంగాణ స్పెషల్ ఫోర్స్ విభాగాలు సహా.. 164 సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌తో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వివరాలను వెల్లడించారు. అలాగే 7వేల మంది ఇతర రాష్ట్రాల హోంగార్డులతో బందోబస్తు నిర్వహి స్తున్నా మని, 89 ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్‌పోస్టులు, 173 అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రూ.186కోట్ల విలువ చేసే మద్యం, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని, తనిఖీలకు సంబంధించి 8,863 కేసులు నమోదు చేశామన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో కేంద్ర బలాలతో భద్రత ఏర్పాటు చేసామని అన్నారు.



## ఆర్టీసీ సంక్రాంతి
# రికార్డు బ్రేక్

- మూడు రోజుల్లో 1.42 లక్షల మంది తరలింపు
- ఆర్టీసీ ఎండి సజ్జన్నార్ వెల్లడి

**హైదరాబాద్,మే12(నమస్తే ఉదయం):** సార్వత్రిక ఎన్నికల వేళ సంక్రాంతి రికార్డును టీఎస్‌ఆర్టీసీ బ్రేక్ చేసింది. సంక్రాంతి సీజన్‌తో పోలిస్తే 10 శాతానికి పైగా ప్రయాణికులు ఆర్టీసీని వినియోగించుకున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు 1.42 లక్షల మంది

మిగతా.. 2లో

# సిఎం రేవంత్ ఆటవిడుపు

- సెంట్రల్ వర్సిటీలో ఫుట్‌బాల్ ఆడిన రేవంత్

**హైదరాబాద్,మే12(నమస్తే ఉదయం):** ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసిపోయింది. కొద్ది నెలలుగా ప్రచారంలో రోజుకు పలు ప్రాంతాలు తిరుగుతూ క్షణం తీరిక లేకుండా గడిపిన రాజకీయ నాయకులు కాస్త ఊరట పొందుతున్నారు. వీరిలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సరదాగా ఫుట్ బాల్ ఆడారు. ఆట మధ్యలో షూ పాడైపోతే షూ లేకుండనే సీఎం ఫుట్ బాల్ ఆడారు. సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, హెచ్‌సీయూ విద్యార్థులు తదితరులు సీఎంతో పాటు ఫుట్ బాల్ ఆడారు. ఈ ఫుట్ బాల్ మ్యాచ్ కి సీఎం సలహాదారుడు వేంనరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు హర్కర్ వేణుగోపాల్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం ఏ ఫహీం, టీ శాట్ సీఈఓ వేణుగోపాల్ రెడ్డి ఇతరులు కూడా హాజరయ్యారు.






### నేడు నాలుగో విడత సార్వత్రిక
# ఎన్నికల పోలింగ్

- పది రాష్ట్రాల్లో 96 స్థానాలకు ఎన్నిక
- ఎపిలో 25, తెలంగాణలో 17 స్థానాలకు పోటీ
- ఎంపి ఎన్నికలతో పాటే ఎపిలో అసెంబ్లీ ఎన్నికలు
- బరిలో యూపిలో సమాజ్‌వాదీ నేత అఖిలేష్ యాదవ్
- భారీ ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ,మే12(నమస్తే ఉదయం):** సోమవారం దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల నాలుగో విడత పోలింగ్‌కు సర్వం సిద్ధం అయింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల సంఘం భద్రతా ఏర్పాట్లు చేసింది. నాలుగో విడతలో ఏపీ, తెలంగాణ సహా మొత్తం 10 రాష్ట్రాల్లో నేడు పోలింగ్ జరగనుంది. నాలుగో విడతలో 96 స్థానాల్లో పోలింగ్ జరుగుతోంది. ఏపీ(25), తెలంగాణ (17), బిహార్(5), ఝార్ఖండ్(4), మధ్యప్రదేశ్(8), మహారాష్ట్ర(11), ఒడిశా(4), యూపీ(13), ప.బెంగాల్(8), జమ్ముకశ్మీర్ (1) స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. లోక్‌సభతో పాటు ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు కూడా ఇదే విడతలో పోలింగ్ నిర్వహించడం తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇక దేశ వ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో కీలక నేతలు తమ అదృష్టాన్ని

మిగతా.. 2లో

# గాలివాన బీభత్సం

## తెలంగాణలో పిడుగులతో వర్షాలు

- వాతావరణశాఖ హెచ్చరికలతో సిఎం సమీక్ష
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు
- ఆదిలాబాద్‌లో గాలివాన బీభత్సం
- మెదక్ జిల్లాలో పిడుగుపాటుకు తండ్రీకొడుకుల మృతి

**హైదరాబాద్,మే12(నమస్తే ఉదయం):** తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం సమీక్ష చేశారు. ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డితో పాటు పలు జిల్లాల పరిధిలో గాలి వాన, పిడుగులు పడి సంభవించిన నష్టంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ సూచనలు ఉన్నందున జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి ఆపద వచ్చినా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెదక్ జిల్లాలో పెద్ద శంకరంపేట మండలంలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందిన ఘటనపై సీఎం రేవంత్ విచారం వ్యక్తం చేశారు. చనిపోయిన ఇద్దరి కుటుంబాలను ఆదుకుంటామని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలంలోని గిమ్మగ్రామంలో పిడుగు పాటుకు ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని, వారికి తగిన వైద్య సాయం అందేలా చూడాలని అక్కడి అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎక్కడైనా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోతే, రైతులు ఆందోళన చెందవద్దని అండగా ఉంటామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లోని తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

ఇదిలావుంటే ఆదిలాబాద్ జిల్లాలో గాలివాన భీబత్సం సృష్టించింది. ఆదివారం ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో ధాన్యం తడిసిపోయింది. జైనథ్ మండలం పిడుగుపాటుకు ఐదుగురికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గాయపడిన వారిని హాస్పిటల్‌కు తరలించారు. కాగా, మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం రామోజీ పల్లిలో పిడుగుపాటుకు తండ్రి,కొడుకు శ్రీరాములు(45), శివరాజు(15)మృతి చెందాడు. కాగా, రాష్ట్రంలో రాగల నాలుగు రోజులు తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. పార్లమెంట్ నాలుగో విడుత ఎన్నికలు తెలంగాణ వ్యాప్తంగా జరుగనున్నాయి. కంటోన్మెంట్ అసెంబ్లీ



మిగతా.. 2లో

# ధర్మాన్ని రక్షించండి

- ఓటే మీ ఆయుధం...ప్రతి ఒక్కరూ వినియోగించుకోండి
- ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడండి
- కరీంనగర్ పార్లమెంట్ ప్రజలకు బండి సంజయ్ విజప్తి



**కరీంనగర్ మే 12 (నమస్తే ఉదయం):** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలందరికీ నమస్కారం. ప్రజాస్వామ్యంలో అతిపెద్ద పండుగ పార్లమెంట్ ఎన్నికలే. ఆ పండుగ సోమవారం మన ముంగిటికి వస్తోంది. డాక్టర్ బాబాసాహెబ్ రచించిన భారత రాజ్యాంగం మనందరికీ ఓటు అనే అత్యంత శక్తివంతమైన ఆయుధాన్ని అందించింది. ఈ ఓటు హక్కును వినియోగించుకుని ధర్మాన్ని కాపాడాలని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కొనసాగించాలని కోరుతున్నా. ముఖ్యంగా మందు, మనీసహా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా... నిజాయితీగా, నిష్పక్షపాతంగా మీకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని కోరుతున్నా.

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు క్రుషి చేస్తున్నారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. నేను ఓటు వేయకుంటే ఏమవుతుందిలే అనే భావనను విడనాడాలి. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, మీరు కోరుకునే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడానికి తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోండి. నూటికి నూరుశాతం పోలింగ్ జరగాలనే ఎన్నికల సంఘం లక్ష్యానికి సహకరించాలని కోరుతున్నా.

ఎన్నికల సంఘం అధికారులు సైతం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఓటరు మహాశయులంతా ఎలాంటి ఇబ్బంది లేకుండా స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. మందు, మనీ ఆశ చూపి ప్రలోభాలకు గురిచేస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని నీరుగారుస్తున్న వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఎన్నికల సంఘం అధికారులను కోరుతున్నా.



# సీఎం ప్రతిష్ఠకు సవాల్!

### రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో హోరాహోరీ.. నాగర్‌కర్నూల్‌లో ప్రతిష్ఠాత్మక పోరు
### మల్లు రవికి పరీక్షగా పార్లమెంటు ఎన్నిక.. ప్రభుత్వ పదవిని వదులుకొని బరిలోకి..
### గట్టి పోటీ ఇస్తున్న ప్రవీణ్‌కుమార్, భరత్

**నాగర్‌కర్నూల్, మే 12 (నమస్తే ఉదయం):** ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని ఎస్సీ రిజర్వుడ్ స్థానం నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ తరఫున ఆ పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి పోటీ చేస్తుండగా, బీఆర్ఎస్ నుంచి మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీజేపీ నుంచి మాజీ ఎంపీ పోతుగంటి రాములు కుమారుడు భరత్‌ప్రసాద్ బరిలో నిలిచారు. స్వయాన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు సోదరుడైన మల్లు రవి.. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేత. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పదేండ్లు అధికారానికి దూరంగా ఉన్నప్పటికీ పార్టీ పునర్‌వైభవానికి కృషి చేశారు. అదే ఆయనకు కలిసొచ్చిన అంశంగా మారింది. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, మాజీ ఎంపీ మంద జగన్నాథ్ కూడా కాంగ్రెస్ టికెట్ కోసం విశ్వప్రయత్నాలు చేసినా.. టికెట్ మల్లు రవినే వరించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఆయనను ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధిగా నియమించి క్యాబినెట్ హోదా కల్పించినా ఆ పదవికి రాజీనామా చేసి మరీ నాగర్‌కర్నూల్ ఎంపీగా బరిలోకి దిగారు. కాగా, బీఆర్ఎస్ తరఫున సిటింగ్ ఎంపీగా ఉన్న పోతుగంటి రాములు అనూహ్యంగా తన కుమారుడితో కలిసి బీజేపీలో చేరారు. జడ్పీ చైర్మన్ ఎన్నిక విషయంలో తన కుమారుడికి తప్ప వేరొకరికి అవకాశం లేకున్నా.. అప్పటి ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, మరికొందరు జిల్లా ఎమ్మెల్యేలు అధిష్ఠానం వద్ద పావులు కదిపి భరత్‌ప్రసాద్‌కు ఆ పదవి దక్కకుండా చేశారనే కోపంతో రాములు బీఆర్ఎసను వీడారు. బీజేపీలో చేరడంతోనే తన కుమారుడికి టికెట్ దక్కించుకున్నారు.

**ప్రధాని మోదీ ప్రత్యేక దృష్టి..**

రేవంత్‌రెడ్డిని దెబ్బ కొట్టే ఉద్దేశంతో నాగర్‌కర్నూల్ స్థానాన్ని బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. జిల్లా కేంద్రంలో జరిగిన బీజేపీ బహిరంగ సభలో స్వయంగా ప్రధాని నరేంద్రమోదీ పాల్గొని రాములు తనయుడు భరత్‌ప్రసాద్ పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత భరత్‌ప్రసాద్ నామినేషన్ కార్యక్రమానికి గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌ను పంపించి.. ఈ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని చెప్పకనే చెప్పారు. ఇక ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యవహారం కూడా రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర బీఎస్పీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి అయిన ప్రవీణ్‌కుమార్ అనూహ్యంగా గులాబీ శిబిరంలో చేరారు. ఆ పార్టీ నుంచి బీఫామ్ దక్కించుకుని ఎన్నికల బరిలోకి దిగారు. మరోవైపు మాజీ ఎంపీ మంద జగన్నాథ్.. కాంగ్రెస్ నుంచి బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. బీఫామ్ కూడా తీసుకొచ్చి నామినేషన్ దాఖలు చేశారు. అయితే బీఫామ్ సమర్పించకపోవడం, తగినంత మంది మద్దతుదారులు లేకపోవడంతో ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైంది. కానీ, మూడుసార్లు నాగర్‌కర్నూల్ ఎంపీగా, రెండుసార్లు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా కొనసాగిన మంద జగన్నాథ్ అంత అసమగ్రంగా నామినేషన్ దాఖలు ఎలా చేశారనే అంశంపై జిల్లాలో తర్జనభర్జనలు జరుగుతున్నాయి.

**మాదిగలు, బీసీల ఓట్లే కీలకం..**

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో మాదిగలు, బీసీల ఓట్లే కీలకం కానున్నాయి. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్న ఈ నియోజకవర్గంలో మొత్తం 17,34,773 మంది ఓటర్లుండగా.. వీటిలో 3లక్షల 54వేల పైచిలుకు ఓట్లు మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారివే ఉన్నాయి. కాగా, గద్వాల, వనపర్తి, అచ్చంపేట, నాగర్ కర్నూల్, కల్వకుర్తిలలో మైనారిటీ వర్గం ఓటర్లు కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ.. రైతులు, మైనారిటీ వర్గం వారి ఓట్లను పెద్ద సంఖ్యలో తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తుండగా, బీజేపీ.. యువకులు, మహిళలు, అప్పర్ మిడిల్ క్లాస్ ఉద్యోగుల ఓట్లపై కన్నేసింది. బీఆర్ఎస్ మాత్రం కాంగ్రెస్ 150 రోజుల పాలనపై విమర్శలు గుప్పిస్తూ ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నాలు చేస్తోంది.

## రాహుల్ వయస్సంత
# సీట్లైనా రావు

### పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌ను ఉద్దేశించి మోదీ

**న్యూఢిల్లీ, మే 12,(నమస్తే ఉదయం):** ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గతంలో ఎన్నడూ రానంత తక్కువ సీట్లు వస్తాయని ప్రధాని మోదీ అన్నారు. ఆయన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వయస్సును గుర్తు చేస్తూ.. "రాహుల్‌కు యాభై ఏళ్లు దాటాయి. కానీ, కాంగ్రెస్ పార్టీకి అన్ని సీట్లు కూడా రావు" అని వ్యాఖ్యానించారు. అవినీతి అనేది ఇండియా కూటమిలోని ఉమ్మడి తత్వం అని, అదే ఆ పార్టీలను కలిపిందని మోదీ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ప్రభుత్వం అవినీతిని పూర్తిస్థాయి బిజినెసగా మార్చిందని విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌ను ఆ పార్టీ 'కుటీర బాంబుల పరిశ్రమ'గా మార్చివేసిందని మండిపడ్డారు. "ప్రతి ఇంటికి మంచి నీళ్లు అని మేం అంటుంటే.. ప్రతి ఇంటిలో బాంబు అని వాళ్లు మాట్లాడుతున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఆదివారం బెంగాల్‌లోని హౌరా, బారక్‌పూర్, హుగ్లీలో ఎన్నికల ర్యాలీల్లో పాల్గొని ప్రసంగించారు. అక్రమ వలసదారుల సంక్షేమమే టీఎంసీ ఎజెండా అని, సీఎం మమతా బెనర్జీ బెంగాల్ రాష్ట్ర ప్రజలను పట్టించుకోవడం ఎప్పుడో మానేశారని ఆరోపించారు. ఇక్కడ హిందువులు రెండో తరగతి పౌరులుగా మారిపోయారని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హిందువులు రామనామం పలకడాన్ని, రామనవమి పండుగను చేసుకోవడాన్ని కూడా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇటీవల ఓ టీఎంసీ ఎమ్మెల్యే హిందువులను భాగీరథి నదిలో పడేస్తాం అన్నారు. వాళ్లకు అంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది?" అని ఎమ్మెల్యే హుమాయూన్ కబీర్ వ్యాఖ్యలను ఉద్దేశిస్తూ మండిపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు టీఎంసీ లొంగిపోయిందన్నారు. తాను బతికి ఉండగా సీఏఏను ఎవరూ రద్దు చేయలేరని మోదీ అన్నారు. సీఏఏ అనేది పౌరసత్వం ఇవ్వడానికే తప్ప, లాక్కోవడానికి కాదన్నారు.

**సందేశ్‌ఖాలీలో టీఎంసీ కొత్త నాటకం**

సందేశ్‌ఖాలీలో టీఎంసీ కొత్త నాటకానికి తెరతీసిందని మోదీ ఆరోపించారు. సందేశ్‌ఖాలీ స్థానిక బీజేపీ నేత అక్కడి మహిళల నుంచి ఖాళీ కాగితాలపై సంతకాలు తీసుకొని, ఆ తర్వాత వాటిపై టీఎంసీ నేతలకు వ్యతిరేకంగా ఫిర్యాదులు రాసి పోలీసులకు ఇస్తున్నట్లు తాజాగా వీడియోలు వైరల్ అయ్యాయి. వీటితో పాటు



సందేశ్‌ఖాలీలో ఆందోళనలు చేయాలంటూ మహిళలకు బీజేపీనే రూ.2వేల చొప్పున పంచిందని, స్థానిక బీజేపీ నేతనే ఈ విషయాన్ని చెప్పినట్లు మరికొన్ని వీడియోలు వైరల్ అయ్యాయి. వీటిని ఉద్దేశించి మోదీ ఆ వ్యాఖ్యలు చేశారు. సందేశ్‌ఖాలీ మహిళలను టీఎంసీ గూండాలు బెదిరిస్తున్నారన్నారు. "సందేశ్‌ఖాలీలోని తల్లులకు, చెల్లెళ్లకు టీఎంసీ ఏం చేసిందో మనందరం చూశాం. కేవలం నిందితుని పేరు షాజహాన్ షేక్ అని పేరు ఉన్నందుకే ఇదంతా జరుగుతోంది. కానీ, టీఎంసీకి భయపడకండి. దోషులెవరినీ వదలబోం" అని మోదీ అన్నారు.

**మంచి పాలన అందించాం**

ఈ పదేళ్లలో మంచి పాలనను అందించడం వల్లనే ఎన్నికల ముందు బీజేపీ ఎటువంటి జనాకర్షక విధానాలను ప్రకటించ లేదని మోదీ చెప్పారు. పదేళ్ల పాలనలో నిజమైన అభివృద్ధిని ఈ ప్రపంచానికి చూపించామన్నారు. ఆదివారం ఓ జాతీయ వార్తా సంస్థకు మోదీ ఇంటర్వ్యూ ఇచ్చారు. తన అడ్డును రాజకీయంగా తొలగించుకోవడానికే ఇన్నాళ్లుగా విపక్షాలు ప్రయత్నిస్తూ వచ్చాయని ఈ సందర్భంగా విమర్శించారు. పేదలను కేంద్రంగా చేసుకుని తాము నిర్వహించిన కార్యక్రమాల వల్ల గత పదేళ్లలో 25 కోట్లమంది దారిద్ర్యరేఖ నుంచి బయటపడ్డారని వివరించారు. కేవలం ఐదేళ్ల కాలాన్ని దృష్టిలో ఉంచుకుని బీజేపీ ఈ ఎన్నికల్లో పోటీచేయడం లేదని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిలపడం లక్ష్యంగానే తలపడుతోందని తెలిపారు.

# దేశమంతా 200 యూనిట్ల ఉచిత విద్యుత్

### పది గ్యారెంటీలను ప్రకటించిన ఆప్ అధినేత కేజ్రీవాల్

**న్యూఢిల్లీ, మే 12:** 'నన్ను అరెస్టు చేసి ఆప్‌ను విచ్ఛిన్నం చేయాలని, ఆప్ ప్రభుత్వాన్ని కూలదోయాలన్న బీజేపీ కుట్ర భగ్నమైంది. నా అరెస్టుతో ఆప్ మరింత బలపడింద'ని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పేర్కొన్నారు. తాను జైలులో ఉన్నప్పుడు ఆప్ ఎమ్మెల్యేలను, నాయకులను బీజేపీ సంప్రదించిందని తెలిపారు. కానీ వారెవరూ బీజేపీ కుట్రలను సాగనివ్వలేదని, ఆప్‌ను వీడి వెళ్లలేదన్నారు. 'దేశం మిమ్మల్ని చూసి గర్వపడుతోంద'ని తన పార్టీ ఎమ్మెల్యేలను అభినందించారు. ఆదివారం కేజ్రీవాల్ వారితో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో లోక్‌సభ ఎన్నికలకు పది గ్యారెంటీలను ప్రకటించారు. కేంద్రంలో 'ఇండియా' అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా 24 గంటల విద్యుత్తు సరఫరా చేస్తామని, ఢిల్లీలో




మాదిరిగా 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తామని చెప్పారు. ఢిల్లీలో చేసినట్టే దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తామని తెలిపారు. ఢిల్లీ మోడల్‌లో దేశమంతటా మారుమూల ప్రాంతాలతో సహా 'మొహల్లా క్లినిక్'లు ఏర్పాటు చేస్తామన్నారు. చైనా ఆక్రమించిన భారత భూభాగాన్ని విడిపిస్తామన్నారు. స్వామినాథన్ కమిటీ నివేదికకు అనుగుణంగా రైతులకు కనీస మద్దతు ధర ఇస్తామన్నారు. ఢిల్లీకి పూర్తిస్థాయి రాష్ట్ర ప్రతిపత్తి కల్పిస్తామన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బీజేపీ అవినీతిపై దేశవ్యాప్తంగా దాడులు చేయిస్తామని, జీఎస్టీని సరళం చేస్తామని కేజ్రీవాల్ తెలిపారు. అయితే, ఈ గ్యారెంటీలను 'ఇండియా' భాగస్వామ్య పక్షాలతో చర్చించలేదని, అందుకు సమయం దొరకలేదని ఒక ప్రశ్నకు బదులిచ్చారు. తాను ప్రధాని పదవి రేసులో లేనని స్పష్టం చేశారు. తర్వాత, కేజ్రీవాల్ పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్‌తో కలిసి ఢిల్లీలో ఆప్ లోక్‌సభ అభ్యర్థుల తరఫున రోడ్ షో నిర్వహించారు.



### విజయవాడ హైవేపై కొనసాగిన రద్దీ

**హైదరాబాద్,మే12 (నమస్తే ఉదయం):** ఎన్నికల నేపథ్యంలో నగరవాసులు సొంతూర్లకు పయణమయ్యారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగిపోయింది. ఆదివారం ఉదయం నుంచే రద్దీ కొనసాగింది. బస్సులతోపాటు సొంత వాహనాల్లో ఓటర్లు తరలివెళ్తుండటంతో ఎల్బీనగర్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఎల్బీనగర్ నుంచి పనామా వరకు వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఏపీతోపాటు ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట వైపు భారీగా ప్రజలు తమ సొంతూర్లకు తరలి వెళ్తున్నారు. దీంతో విజయవాడ హైవేపై పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు.

## తెలంగాణలో లోక్‌సభ సమరం

**మొదటిపేజీ తరువాయి..**

సమస్యాత్మకమైనవిగా గుర్తించిన ఎన్నికల సంఘం, అలాంటి ఏరియాల్లో ప్రత్యేక బలగాలతో నిఘా పెట్టేలా ప్లాన్ చేసింది. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరుగనుంది. రాష్ట్రంలో 13 అసెంబ్లీ నియోజకవర్గాలను నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన ఎన్నికల సంఘం.. అలాంటి ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ జరగాలని నిర్ణయించింది. రాష్ట్ర పోలీసులతో పాటు ఎన్నికల విధుల్లో భాగంగా కేంద్రం నుండి 175 కంపెనీలు విధుల్లో ఉండనున్నాయి. ఎన్నికల విధుల్లో 2.80 లక్షల మంది ఉద్యోగులు విధులు నిర్వర్తించనున్నారు. ఎన్నికల్లో వ్యయ పరిశీలకులుగా 14 మందిని నియమించారు. జనరల్ పరిశీలకులుగా 17 మందిని నియమించారు.

ఇకపోతే ఎన్నికల సిబ్బంది సామాగ్రితో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. వారిని ప్రత్యేక వాహనాల్లో భద్రత మధ్య చేరవేశారు.

## ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలి

### ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి

**నిజామాబాద్,మే12(నమస్తే ఉదయం):** కేసీఆర్ పాలనా విధానాలే తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష అని, మరోమారు ప్రజలు తమను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలన తీరుతో పోల్చుకుని బిఆర్ఎస్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు. సోమవారం జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని అన్నారు. ప్రజల స్పందన బాగుందని అన్నారు. ప్రజలంతా తరలివచ్చి ఓటేయాలని అన్నారు. ఓటు వేయడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడుకోవాలని అన్నారు. తెలంగాణలో నిర్మించిన ప్రాజెక్టులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రైతు ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. తెలంగాణ దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా మారిందంటే అది కెసిఆర్ చేసిన కృషి అన్నారు. కాంగ్రెస్, బిజెపిల నేతలు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని అన్నారు. ఎన్నికల్లో ప్రజలు వీరికి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పూర్తి ఆధిపత్యంలోకి వస్తుందని అన్నారు. తెలంగాణలో పదేళ్ల నాటికి, నేడు ఉన్న పరిస్థితులను ప్రజలు గమనించాలన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన కేసీఆర్ వెంట ప్రజలు నిలువాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు కళ్లముందు కనిపిస్తున్నాయన్నారు.

## గాలివాన బీభత్సం

**మొదటిపేజీ తరువాయి..**

స్థానానికి సైతం ఉప ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలో రాగల నాలుగు రోజులు తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరా బాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తూ వానలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది.

మంగళవారం ఉమ్మది ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపే, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు పడుతాయని చెప్పింది. బుధ, గురువారాల్లోనూ పలు జిల్లాల్లో వానలు పడే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వివరించింది.

## నేడు నాలుగో విడత సార్వత్రిక ఎన్నికల పోలింగ్

**మొదటిపేజీ తరువాయి..**

పరీక్షించుకోనున్నారు. ఈ విడతలో సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ పోటీ చేస్తున్న కన్నౌజ్ నియోజకవర్గంలో పోలింగ్ జరుగుతోంది. బీజేపీకి కంచుకోటగా ఉన్న ఉత్తరప్రదేశ్ లో కన్నౌజ్‌తో పాటు షాజహాన్‌పూర్, ఖేరీ, ధౌరహర, సీతాపూర్, హర్దోయి, మిస్రిఖ్, ఉన్నావ్, ఫరూఖాబాద్, ఎటా, కాన్పూర్, అక్బర్‌పూర్, బహ్రైచ్ నియోజవర్గాల్లో రేపు ఎన్నికలు నిర్వహించనున్నారు. 4వ విడతలో పోటీలో ఉన్న ప్రముఖుల్లో అఖిలేష్‌తో పాటు టీఎంసీ నేతలు మహువా మొయిత్ర వెస్ట్ బెంగాల్ కృష్ణనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బరిలో దిగనున్నారు. అలాగే తృణముల్ కాంగ్రెస్ నేత శత్రుఘ్న సిన్హా ఆసన్సోల్ నుంచి పోటీ చేస్తున్నారు. బీజేపీ ముఖ్య నేతలు గిరిరాజ్ సింగ్ బీహార్‌లోని బేగుసరాయి నియోజకవర్గంలో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఝార్ఖండ్ నుంచి ఖుంటి నియోజకవర్గంలో అర్జున్ ముండా పోటీ చేస్తున్నారు. మూడో విడతలో అధికారంలో ఉన్న అమిత్ షా వంటి అగ్రనేతలు బరిలో నిలిస్తే ఇప్పుడు ప్రతిపక్షంలోని ముఖ్యనేతలు ఎన్నికల్లో పోటీ చేయడంతో ఆసక్తిగా మారింది.

## ఆర్టీసీ సంక్రాంతి రికార్డు బ్రేక్

మొదటిపేజీ తరువాయి..

ప్రయాణించారని టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడించారు. ఇక ఏపీకి 59,800 మంది ప్రయాణించారని తెలిపారు. కాగా, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం టీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఏపీ వైపునకు ఇప్పటివరకు 590 స్పెషల్ బస్సులను ఏర్పాటు చేయగా.. తాజాగా హైదరాబాద్-విజయవాడ రూట్‌లో 140 సర్వీసులను ఆన్‌లైన్‌లో ముందస్తు రిజర్వేషన్ కోసం పెట్టింది. ఆయా బస్సుల్లో దాదాపు 3 వేలకుపైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. టికెట్ల ముందస్తు రిజర్వేషన్ కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని టీఎస్ఆర్టీసీ కోరింది. అలాగే, హైదరాబాద్ నుంచి జిల్లాలకు 1500 ప్రత్యేక బస్సులను టీఎస్ఆర్టీసీ నడుపుతోంది. జేబీఎస్, ఎంజీబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్, ఆరాంఘర్, తదితర ప్రాంతాల నుంచి ఈ బస్సులను తిప్పుతోంది. ప్రయాణికుల రద్దీని బట్టి ఎప్పటికప్పుడు బస్సులను అందుబాటులో ఉంచాలని క్షేత్రస్థాయి అధికారులను యాజమాన్యం ఆదేశించింది. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా సొంతూళ్లకు వెళ్లి తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రయాణికులను ఈ సందర్భంగా టీఎస్ఆర్టీసీ యాజమాన్యం కోరింది.



# ఆర్టీసి ఎక్స్ప్రెస్ బస్సుకు స్పెషల్ బస్ అనే స్టిక్కర్ పెట్టి మహిళా ప్రయాణికుల నుంచి ముక్కు పిండి చార్జీలు వసూలు

**హైదరాబాద్, మే12(నమస్తే ఉదయం):**
తెలంగాణ ఎక్స్ప్రెస్ బస్సు కు స్పెషల్ బస్ అనే స్టిక్కర్ పెట్టి మహిళా ప్రయాణికుల నుంచి ముక్కు పిండి పైసల్ వసూలు చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది.

తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళల ఓట్లను రాబట్టుకునేందుకు ప్రతిష్టాత్మకంగా హామీ ఇచ్చిన మహాలక్ష్మి పథకంలో డొల్లతనం బయటపడింది వివరాల్లోకి వెళితే హైదరాబాద్ నుంచి కర్నూలు వస్తున్న ఎక్స్ప్రెస్ బస్సులో అల్లంపూర్ చౌరస్తా వరకు ఫ్రీగా మహిళలకు రవాణా సౌకర్యం కలదు.(ప్రతిరోజు స్పెషల్ బస్ పేరుతో మహిళలతో డబ్బులు వసూలు చేస్తున్న తెలంగాణ ఆర్టీసీ సిబ్బంది.) కానీ ఎక్స్ప్రెస్ బస్సు కు స్పెషల్ బస్ అని స్టిక్కర్ అతికించి నేడు మాతృ దినోత్సవం జరుపుకుంటున్న మహిళా ప్రయాణికుల నుంచి డబ్బులు తీసుకొని టికెట్ ఇవ్వడం ఎంతవరకు సబబని, ఆ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు వాపోయారు.

# ఎన్నికల విధుల్లో ఎన్ సి సి కేడిట్లు

**రాజేంద్రనగర్, మే12(నమస్తే ఉదయం):** పార్లమెంట్ సాధారణ ఎన్నికల్లో వ్యవసాయ, పశు వైద్య విశ్వవిద్యాలయంలో చదివే ఎన్ సి సి విద్యార్థులు విధులు నిర్వహించారు. ఆదివారం



డీసీపీ శ్రీనివాస్‌తో ఎన్ సి సి కెడిట్లు

రాజేంద్రనగర్ డిసిపి చింతమనేని శ్రీనివాసన్ 21 మంది ఎన్ సి సి విద్యార్థులు కలిశారు. ఈ సందర్భంగా డిసిపి సిహెచ్ శ్రీనివాస్ విద్యార్థులకు ఎన్నికల విధుల్లో నిబంధనలను వివరించారు. ఎన్నికల విధుల్లో ఎన్ సి సి విద్యార్థులు ప్రజలకు సహకారాలు అందించాలని కోరారు.

## ఈత కోసం వెళ్లి క్వారీ గుంతలో
# మునిగి బాలుడు మృతి

**షాద్ నగర్,మే12(నమస్తే ఉదయం):**
ఈత కోసం వెళ్లి క్వారీ గుంతలో మునిగి బాలుడు మృతి చెందిన సంఘటన కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఆదివారం కేశంపేట పోలీసులు తెలిపి వివరాల ప్రకారం...కేశంపేట మండలం పుట్టొనిగూడ గ్రామపంచాయతీ కక్కరాల తాండకు చెందిన మూడవత్ నితిన్ (18) గ్రామ సమీపంలోని క్వారీ గుంతలో ఈతకని వెళ్లి మునిగి



సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మరణించడం జరిగిందన్నారు.అనంతరం మృతదేహాన్ని వెలికి తీయడం కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి బాలుడి శవాన్ని వెలికి తీయడం జరిగిందన్నారు.ఈ సమాచారాన్ని తెలుసుకున్న షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘటన స్థలాన్ని సందర్శించి స్వయంగా పర్యవేక్షించడం జరిగిందన్నారు.మృతదేహాన్ని వెలికితేత తరువాత బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగిందని సూచించారు.మృతుడు కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారు.

# అమ్మను మించిన దైవం లేదు...

### రాజేంద్రనగర్ మన్నా చర్చిలో మదర్స్ డే వేడుకలు

**రాజేంద్రనగర్,మే12(నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ మన్నా చర్చిలో ఆదివారం మదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు క్రైస్తవ సోదరులు ఆరాధనలు జరుపుకున్నారు. అనంతరం మాతృమూర్తులు అందరిని వేదికపైకి పిలిచి మదర్స్ డే వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా తల్లులందరి గురించి బ్రదర్ జోబ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.బైబిల్‌లో ఉన్న తల్లుల గురించి వివరించారు.పిల్లలను పెంచడంలో కుటుంబ


రాజేంద్రనగర్ మన్నా చర్చిలో మదర్స్ డే జరుపుకుంటున్న క్రైస్తవులు

బాధ్యత,తల్లుల పాత్ర ఎంతో ఉంటుందని గుర్తు చేశారు.అమ్మ లేనిదే జీవితానికి అర్థం లేదు..ఏమిచ్చి అమ్మ రుణం తీర్చుకోగలం..అలాంటి ఆలోచనలో నుంచి పుట్టిందే మాతృ దినోత్సవం మని వివరించారు.




పశు వైద్య విశ్వవిద్యాలయంలో ఈవీఎంలతో అధికారులు, సిబ్బంది

## పటిష్టమైన భద్రతతో
# ఈవీఎంలు పోలింగ్ కేంద్రాలకు తరలింపు

**రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 543 పోలింగ్ కేంద్రాలు, 49 రూట్లు**

**నేడే పోలింగ్..కేంద్రాల వద్ద ఈసీ నిఘా**

**రాజేంద్రనగర్ పశు వైద్య విశ్వవిద్యాలయంలో ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు తరలిన అధికారులు**

**సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా: డీసీపీ సిహెచ్ శ్రీనివాస్**

**ఎన్నికలకు సర్వం సిద్ధం..పోలింగ్ స్టేషన్లకు ఈవీఎంలు**

**రాజేంద్రనగర్,మే12(నమస్తే ఉదయం):**
పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించే పోలింగ్‌కు సర్వం సిద్ధంమైంది.చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.పార్లమెంట్ పరిధిలోని రాజేంద్రనగర్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేశారు.ఆదివారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి,జిల్లా కలెక్టర్ శశాంక పర్యవేక్షణలో ఆర్డిఓ వెంకట్ రెడ్డి,రాజేంద్రనగర్,గండిపేట్, శంషాబాద్ మండలలకు చెందిన తహసిల్దార్లు రాములు, నాగమణి, శ్రీనివాస్ రెడ్డిలు పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు, ఎన్నికల సామాగ్రిని అందజేశారు.

సిబ్బంది ఈవీఎంలను తీసుకుని ప్రత్యేక వాహనాల ద్వారా వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది.ప్రతి పోలింగ్ స్టేషన్‌కు ప్రిసైడింగ్ ఆఫీసర్,అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్,అదర్ పోలింగ్ ఆపీసర్స్‌తో కూడిన ఆరుగురు బృందాన్ని అధికారులు కేటాయించారు. డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్ద పెద్దపెద్ద టెంట్లు ఏర్పాటు చేశారు. వేసవి తీవ్రతకు ఇబ్బంది లేకుండా కూలర్లు ఏర్పాటు చేశారు.త్రాగునీరు,మొబైల్ టాయిలెట్స్ అందుబాటులో ఉంచారు.ఎన్నికల సిబ్బందికి ఉదయం టిఫిన్‌తో పాటు మద్యాహ్నం భోజన సౌకర్యాన్ని కూడా కల్పించారు. నియోజక వర్గంలో ఉన్న రాజేంద్రనగర్, గండిపేట్,శంషాబాద్ మండలలకు సంబంధించి 543 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటిని 49 రూట్‌లుగా విభజించి 49 మంది రూట్ అధికారులు,49 మంది సెక్టోరియల్ అధికారులు,48 మంది మైక్రో అబ్జర్వర్‌లను నియమించారు.ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక పీవో, ఒక ఏపీవో,ఇద్దరు ఎపీవోలను ఇలా మొత్తం 10 వేల మంది ఎన్నికల సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.ఏర్పాటు చేసిన అధికారులు అందుకు తగిన రీతిలో సిబ్బందిని కేటాయించి, వారిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఆర్టీసి బస్సులతో పాటు, ప్రైవేటు వాహనాలను ఉపయోగించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 288 మోడల్ పోలింగ్ స్టేషన్లకు స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. సర్కిల్ పరిధిలోని 288 పోలీస్ స్టేషన్లను రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ పరిశీలించారు.పోలింగ్ సందర్భంగా అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.సిసి నిఘాలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఎన్నికల సరళిని పరిశీలిస్తారు.

**పకడ్బందీ ఏర్పాట్లు : చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి,కలెక్టర్ శశాంక**

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ శశాంక తెలిపారు.చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి జరుగుతున్న పనుల గురించి డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్ సెంటర్‌లను తనిఖీ చేశారు.సాధారణ ఎన్నికల నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలు,జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు.ఎన్నికల నేపథ్యంలో సోమవారం 13వ తేదీ ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగడానికి,ఓటర్లు తమ ఓటు హకు స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు.చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు,5 గురికి మించి గుమిగూడ వద్దని తెలిపారు.జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రతిక్షణం అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ పర్యవేక్షించడం జరుగుతుందని అన్నారు. సోమవారం జరుగబోయే ఎన్నికలకు అన్ని విధాల సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు.

**ఎన్నికలు సజావుగా సాగేలా భారీగా బందోబస్తు..**

**- రాజేంద్రనగర్ జోన్ డిసిపి చింతమనేని శ్రీనివాస్**



చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని రాజేంద్రనగర్ డిస్ట్రిబ్యూషన్ ఎన్నికల ఏర్పాట్లను రాజేంద్రనగర్ జోన్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ పరిశీలించారు. సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం రాజేంద్రనగర్ జోన్ పరిధిలో 1200మంది పోలీస్ సిబ్బంది,నాలుగు కంపెనీల సీఏపీఎఫ్ బలగాలు,రెండు డిఆర్ఎస్ లు,ఏడు మంది ఏసీపీలు,28 మంది ఇన్స్పెక్టర్ లు డీఎస్పీతో ప్రత్యేక బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని రాజేంద్రనగర్ జోన్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ తెలిపారు.

సోమవారం పోలింగ్ నిర్వహించిన అనంతరం అదే రూట్లల్లో ఈవీఎంలతో పాటు వీవీ ప్యాట్లను వాహనాల్లో తీసుకొని చేవెళ్లలోని బండారు శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి తీసుకువచ్చి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి పరిశీలన అనంతరం గోదాముల్లోని స్ట్రాంగ్ రూమ్‌ల్లోకి తరలించి భద్రపరచనున్నారు.

# ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

**-జిల్లా కలెక్టర్ బి.ఎస్. సంతోష్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 12(నమస్తే ఉదయం)**
పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని, 13వ తేదీన ప్రజలందరూ తప్పనిసరిగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ విజ్ఞప్తి చేశారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని ఈ నెల 13వ తేదీన నిర్వహించిన పోలింగ్ కోసం పగడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ సమయం సాయంత్రం 6 గంటల వరకు పొడిగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు పోలింగ్ కేంద్రానికి వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని, ఓటింగ్ శాతం పెరగడానికి సహకరించాలని కోరారు. జిల్లా ఎన్నికల అధికారి ఈరోజు గద్వాల అలంపూర్ అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించారు.79-గద్వాల్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 303 పోలింగ్ కేంద్రాలకు గాను పి.ఓ లు 303 , ఎ.పి .ఓ లు 303, ఓ.పి.ఓ లు 606 మొత్తం 1212 మంది ఎన్నికల సిబ్బందితో పాటుఅదనంగా 244 మందిని కేటాయించడం జరిగిందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో 44 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగిందని, గద్వాల్ లో 34 రూట్లను ఏర్పాటు చేసి ఒక్కో రూట్ కు ఒక్కో సెక్టార్ అధికారిని నియమించడం జరిగిందని అన్నారు. వారికి ప్రత్యేక వాహనాలను , పోలింగ్ సిబ్బందిని తరలించుటకు 34 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.80- అలంపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ లో 291 పోలింగ్ కేంద్రాలకు గాను పి.ఓ లు 291 , ఎ.పి .ఓ ల 291, ఓ.పి.ఓ లు 582 , రిజర్వు 236 మందిని కేటాయించడం జరిగిందని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో 54 మంది మైక్రో


ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఈవీఎంలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ బి ఎస్ సంతోష్

అబ్జర్వర్లను నియమించడం జరిగిందని అన్నారు. గద్వాల్‌లో 31 రూట్లను ఏర్పాటు చేసి ఒక్కో రూట్‌కు ఒక్కో సెక్టార్ అధికారిని నియమించడం జరిగిందని అన్నారు. వారికి ప్రత్యేక వాహనాలను, పోలింగ్ సిబ్బందిని తరలించుటకు 31 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది ఈరోజు సాయంత్రం ఆరు గంటల వరకు వారి పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడం జరుగుతుందని తెలిపారు. కూలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద భోజన సదుపాయాలతో పాటు, త్రాగునీరు, మరుగుదొడ్లు ఇతర సదుపాయాలు కల్పించడం జరిగిందని అన్నారు. తీవ్రమైన ఎండల దృష్ట్యా పోలింగ్ సిబ్బందికి అవసరమైన టెంట్లు, కూలర్లతో పాటు మెడికల్ కిట్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర వసతులు కల్పించడం జరిగిందన్నారు. ప్రశాంత వాతవారణంలో ఎన్నికలు నిర్వహించడానికి అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేసామని తెలిపారు. ఓటు వేయడం అందరి బాధ్యత అని, జిల్లాలోని ప్రతి ఓటరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినుయోగించుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# గుడ్ న్యూస్ : రైతుల అకౌంట్లోకి 9500 జమ

**హైదరాబాద్,మే12(నమస్తే ఉదయం):**
ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజనను పీఎం కిసాన్ యోజన అని కూడా అంటారు.2019లో భారత ప్రభుత్వం ప్రారంభించిన విప్లవాత్మక కార్యక్రమాల్లో ఇది కూడా ఒకటి. సన్న,చిన్నకారు రైతులకు ఆర్థిక సహాయం అందజేసేందుకు దీన్ని తీసుకువచ్చారు.వీరికి ఆర్థిక సహాయం అందించడం, వ్యవసాయ కార్యకలాపాలను కొనసాగించడం, జీవనోపాధిని మెరుగుపరచడం దీని ప్రధాన లక్ష్యం.మే చివరకు..లేదంటే జూన్‌లో దేశవ్యాప్తంగా ఉన్న అన్నదాతలతోపాటు ఏపీ తెలంగాణ రైతులు కూడా 17వ విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన కోసం ఎదురుచూస్తున్నారు.వారికి



16వ విడత డబ్బులు ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలయ్యాయి.ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఈ పథకం కింద డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లోనే పడతాయి.ప్రతి వాయిదాకు రూ.2వేల చొప్పుడు మూడు విడతల్లో మొత్తం రూ.6వేలు రైతుల ఖాతాల్లో జమయ్యాయి.

17వ విడత డబ్బు మే చివరికి లేదంటే జూన్ మొదటివారంలో విడుదలయ్యే అవకాశం ఉంది.ప్రతి ఏడాది రూ.21వేలుదీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 17వ విడత కోసం రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి. కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద కేంద్రం రైతులకు ఏటా రూ.6వేలు అందిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం రైతు బంధు ద్వారా రూ.10వేలు అందిస్తోంది.

వచ్చే వర్షాకాలం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలోని రైతులందరికీ రైతు భరోసా పేరుతో రూ.15వేలు అందించబోతోంది. మొత్తంగా అన్నదాతలకు ప్రతి సంవత్సరం రూ.21వేల చొప్పున వారి ఖాతాల్లో జమవుతున్నాయి. ఈకేవైసీ తప్పనిసరి జూన్ మొదటివారంలో రూ.2వేలు జమైన తర్వాత వర్షాకాలంలో తెలంగాణ రైతుల ఖాతాలో ఎకరాకు రూ.7500 వేయనున్నారు.ఒకేసారి రైతులకు రూ.9500 పెట్టుబడి సాయం కింద అందనున్నాయి.

pmkisan.gov.in అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. వ్యవసాయ మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్, PM కిసాన్ సమ్మాన్ నిధి హెల్ప్‌లైన్ నంబర్ 1800-945-8955లో పూర్తి సమాచారం తెలుసుకోవచ్చు.అయితే రైతులు తప్పనిసరిగా 17వ విడత డబ్బుల కోసం ఈకేవైసీ చేయించుకోవాలి.



చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద విద్యుత్ ఏర్పాటు చేస్తున్న ఏడిఈ స్వామి, ఏఈలు జానీ మోహిని ద్దీన్, నరేందర్లు

## చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల కేంద్రం బిఎస్ఐటి వద్ద

# ప్రత్యేక విద్యుత్ ఏర్పాట్లు

**విద్యుత్ సరఫరా లో అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు: ఏ డి ఈ స్వామి**

చేవెళ్ల, మే12(నమస్తే ఉదయం): చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం చేవెళ్లలోని బండారు శ్రీనివాస్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బి ఎస్ ఐ టి) లో ఏర్పాటు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల నుండి ఈవీఎంలను పోలింగ్ అనంతరం బిఎస్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరచనున్నారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం లోని మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూర్ అసెంబ్లీ నియోజకవర్గం లోని పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ అనంతరం కౌంటింగ్ కేంద్రానికి ఈవీఎంలను తరలిస్తున్నట్లు చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ తెలిపారు, రెవెన్యూ యంత్రాంగం ఎన్నికలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు.

**ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద నిరంతర విద్యుత్...**

చేవెళ్లలోని బి ఎస్ ఐ టి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన దృష్ట్యా సైబర్ సిటీ విద్యుత్ అధికారులు విద్యుత్ ఏర్పాట్లను సంపూర్ణంగా ఏర్పాటు చేశారు. విద్యుత్ సైబర్ సిటీ ఎస్ ఇ పి వెంకన్న, ఇబ్రహీం భాగ్ డి ఈ ఎం శివశంకర్, చేవెళ్ల సబ్ డివిజన్ ఏ డి ఈ స్వామి, అసిస్టెంట్ ఇంజనీర్లు జానీ మోహినిద్దీన్, నరేందర్ లు తమ సిబ్బందితో ఆదివారం విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పడటం చేశారు. విద్యుత్ సరఫరా లో ఏమైనా ఇబ్బంది ఉంటే ప్రత్యామ్నయం జనరేటర్ సైతం ఏర్పాటు చేశారు.

# ఓటు మన బాధ్యత

**- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్**

రాజేంద్రనగర్, మే12(నమస్తే ఉదయం): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవడం పౌరుల బాధ్యత అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.లక్ష్మణ్ అన్నారు. పౌరుల తలరాతలను మార్చే ఓటు హక్కు విషయంలో నిర్లక్ష్యం ఎంత మాత్రం తగదని ఆయన స్పష్టం చేశారు. గుడ్ ఫ్రెండ్స్, చింతకుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్తాపూర్ డివిజన్ పరిధిలోని చింతకుంట పార్కులో ఆదివారం



మార్నింగ్ వాకర్స్ చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం లక్ష్మణ్

ఓటర్ అవగాహన కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ లక్ష్మణ్ మాట్లాడుతూ, విద్యావంతులు, వివేకుల కంటే పెద్దగా చదువుకోని వారు చక్కగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని అన్నారు. దేశ భవిష్యత్తును మార్చే ఈ లోక్సభ ఎన్నికలలో కూడా మొదటి మూడు దశల్లో పోలింగ్ శాతం పరిపోవడం ఆందోళనకర పరిణామం అని అన్నారు. ఈ పరిస్థితి నివారించడానికి సోమవారం జరిగే ఎన్నికలలో తెలంగాణ ప్రజలు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రముఖ బిల్డర్ రామిరెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ నగర ప్రాంతాలలో పోలింగ్ శాతం దారుణంగా పడిపోవడం ఆందోళనకరమైన విషయమని అన్నారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా ఓటర్లు బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. సామాజిక కార్యకర్త, సీనియర్ జర్నలిస్ట్ మ్యాడం మధు సూదన్ కార్యక్రమానికి వందన సమర్పణ చేశారు.

ఈ కార్యక్రమంలో వివిధస్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు వినోద్ కుమార్ ,సుబ్బరాజు, సుధాకర్ ప్రభాకర్, ప్రవీణ్, నరసింహ, కొంగల శీను,శెట్టి గారి శేఖర్, శ్రీధర్ రెడ్డి, సిరి పాల్ రెడ్డి శతదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

**- సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి**

రాజేంద్రనగర్, మే12(నమస్తే ఉదయం): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి కోరారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల బందోబస్తు నిమిత్తం ఎనిమిది వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సమత్యాత్మక పోలింగ్ స్టేషన్ లను ఆయన పరిశీలించారు. ముందుగా అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని పోలింగ్ స్టేషన్ ను సందర్శించిన ఆయన ఆ తర్వాత సిక్ చావునీ, నౌ నెంబర్ , సులేమాన్ నగర్ , శాస్త్రి పురం పోలింగ్ స్టేషన్ లను పరిశీలించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు . పోలింగ్




రాజేంద్ర దగ్గర సర్కిల్‌లోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లను పరిశీలిస్తున్న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి.. చిత్రంలో రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తదితరులు

స్టేషన్ లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సోమవారం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కమిషనర్ వెంట రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌తో పాటు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా

# లోక్ సభ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత

**- గద్వాల జిల్లా ఎస్పీ రితిరాజ్**

**శాంతియుత వాతవారణంలో ఎన్నికలు నిర్వహించడానికి 1200 మంది జిల్లా, రాష్ట్ర , కేంద్ర పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తు**

**క్రిటికల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా**

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 12(నమస్తే ఉదయం): అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే లోక్ సభ ఎన్నికలకు కూడ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎస్పీ రితిరాజ్ ,? పేర్కొన్నారు. సోమవారం జరిగబోయే పార్లమెంట్ ఎన్నికలకు చేపట్టిన భద్రతా చర్యలను ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఇతర శాఖల సమన్వయంతో కలిసి పని చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పి గారు తెలిపారు. తద్వారా జిల్లాలోని ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ యొక్క ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పిస్తున్నాం.శాంతి యుత వాతవారణంలో ఎన్నికలు నిర్వహించడానికి జిల్లాలో 1200 మంది జిల్లా, రాష్ట్ర (టి ఎస్ ఎస్ పి , శిక్షణ కానిస్టేబుళ్లు), కేంద్ర (3 కంపినీల ఐటి బిపి బలగాల) పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది ,ప్రతి మండలానికి ఇన్స్పెక్టర్ స్థాయి అధికరితో ప్రత్యేక పెట్రోలింగ్ పార్టీలు, 65 రూట్ మొబైల్స్, 25 క్విక్ రియాక్షన్ టీమ్స్ (QRT)/ స్ట్రయికింగ్ ఫోర్స్/ స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్స్/ అబ్జర్వేషన్ టీమ్స్ లతో పకడ్బందీ గ భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు.

**జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వివరాలు:**

జిల్లాలో మొత్తం పోలింగ్ స్టేషన్ లు 594, సాధారణ పోలింగ్



స్టేషన్లు 435 , క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు 159.

**స్వాధీన పరుచుకున్న వివరాలు :**

ఇప్పటివరకు స్వాధీనపరచుకున్న నగదు 1,56,76,860 /- రూపాయలు.

లిక్కర్ 5344.095 లీటర్లు, సుమారుగా అంచనా విలువ 37,08,066/- /-రూపాయలు

**ఇతర సామాగ్రి:** సుమారుగా అంచన విలువ 7500 /- రూపాయలు.

సీజ్ చేసినా నగదు, లిక్కర్, ఇతర వస్తువుల విలువ మొత్తం విలువ 1,93,92,426/- రూపాయలు

జిల్లాలో ఇప్పటివరకు బైండోవర్ చేయబడిన వ్యక్తులు 390

గతంలో ఎలక్ట్రోరల్ నేరాలకు పాల్పడ్డ వ్యక్తులను మరియు అందులో సహకరించిన వ్యక్తులను బైండోవర్ చేయడమైనదని, రౌడీ షీట్ కలిగిన వారిని కూడా ముందస్తుగా బైండోవర్ చేయడం జరిగింది. 32 ఎన్ బి డబ్ల్యు ఎగ్జిక్యూట్ చేయడం జరిగింది అన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనాలపై కఠినంగా ఉన్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన రోజు నుండి ఇప్పటివరకు జిలాల్లో ఎన్నికల నియామావళి ఉల్లంఘన కేసులు 04 నమోదు కావడం జరిగిందని అన్నారు.

**లైసెన్సుదు ఆయుధముల డిపాజిట్:** ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నియామవళి అనుసారంగా లైసెన్సు కలిగిన ఆయుధములు అన్నియు డిపాజిట్ కొరకు అండర్ సెక్షన్ 144 Cr.pc అనుసరించి నిషేధాజ్ఞలు జారీ చేయడం జరిగింది , ఇప్పటికే జిల్లాలో ఉన్న మొత్తం 53 ఆయుధములు డిపాజిట్ కాబడినవి.

జిల్లా ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఎన్నికలు నియమావళి పాటిస్తూ స్వేచ్ఛాయుత వాతావరణం లోఎలాంటి భయం, వత్తిడి లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, అందుకు సంబందించి ప్రజలకు సురక్షితమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగినదని ఓటు ఉన్న అందరు ఓటు వేయాలని ఎస్పీ రీతి రాజ్ కోరారు.ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100 కి లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడిన, ఎన్నికల నియమావళి ప్రకారం చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎలాంటి భయం లేకుండా ఓటు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ రీతి రాజ్ కోరారు.

# సంత్ సేవాలాల్ మహారాజ్ నిజమైన సేవకుడు

**ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి**

**మల్లాపూర్ గ్రామపంచాయతీ గుడి తండాలో సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ట, మరియమ్మ యాడి వార్షికోత్సవ కార్యక్రమం**

**హాజరైన మాజీ సర్పంచులు రవి నాయక్, రాందాస్ నాయక్**

కొత్తూరు,మే12 (నమస్తే ఉదయం): సంత్ సేవాలాల్ మహరాజ్ బంజారాల ఆరాధ్య దైవం అని సమాజానికి నిజమైన సేవకుడని ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి అన్నారు. కొత్తూరు మండలంలోని మల్లాపూర్ గ్రామ పంచాయతీ గుడి తాండలో ఆలయ చైర్మన్ నరసింహ,పూజారి పాండు నాయక్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ విగ్రహ ప్రతిష్ట, మరియమ్మ యాడి వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...
బంజారా జాతిని మంచి మార్గంలో నడిపించేందుకు సేవాలాల్ మహరాజ్ ధర్మ ప్రచారం,ఆర్థిక సంస్కరణలు,మత మార్పిడిలు



సంత్ సేవాలాల్ ఉత్సవాలలో పాల్గొన్న ఎంపీపీ మధుసూదన్ రెడ్డి

అరికట్టడం,క్షేత్రధర్మాన్ని రక్షించడం లాంటి అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచులు దశరత్ నాయక్,ఉప్పల దయానంద్ గుప్తా, నరసింహారెడ్డి, దయ్యాల మల్లేష్,మాజీ ఎంపిటిసి మోడీ దర్శన్,లక్ష్మణ్ నాయక్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సిద్దు గౌడ్, శ్రీరాములు, జయేందర్ రెడ్డి, పాపిరెడ్డి, దయానంద రెడ్డి, బోకుల రాజు,శంకర్ నాయక్, శ్రీను, నరేష్, శ్రీశైలం, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలను నడిపేదెట్లా?

**నిధుల్లేక పంచాయతీల్లో పేరుకుపోతున్న సమస్యలు - ఆందోళనలో పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు**

హైదరాబాద్, మే 12 (నమస్తే ఉదయం): గ్రామపంచాయతీలు నిధుల సమస్యతో కొట్టుమిట్టాడుతున్నాయి. ముఖ్యంగా చిన్న గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేందుకు ట్రాక్టర్లలో డీజిల్ పోయడానికి కూడా డబ్బుల్లేని దుస్థితి. పంచాయతీ భవనాల కరెంటు బిల్లులు కట్టడానికి కూడా నిధుల్లేవని పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒత్తిడికి లోనవుతున్నారు. రెండేళ్లుగా రాష్ట్ర ఆర్థిక సంఘం(ఎసఎఫసీ) నిధులను సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో గ్రామ పంచాయతీల్లో తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఎస్ఎఫసీ కింద ప్రతి నెలా రూ.230 కోట్లకు పైగా విడుదల చేయాల్సి ఉంటుంది. 2022 ఆగస్టు వరకు పంచాయతీల ఖాతాల్లో నిధులు జమచేసిన రాష్ట్ర సర్కారు.. ఆ తర్వాత పెండింగ్ పెడుతూ వస్తోంది. దీంతో, మొత్తంగా గ్రామపంచాయతీలకు ఎస్ఎఫసీ నిధులు రూ.4,600 కోట్లు రావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు రావాల్సిన నిధులు రాకపోవడం, ఇతర ఆదాయ వనరుల్లేక పోవడంతో గ్రామాల్లో కనీస సమస్యలను కూడా పరిష్కరించే పరిస్థితి లేకుండా పోయిందని సంబంధిత విభాగాలు చెబుతున్నాయి.

**పాలకవర్గాల ఎన్నిక తర్వాతే నిధులు**

పంచాయతీలకు సక్రమంగా నిధులు విడుదల చేయకపోయినా పాలకవర్గాలు ఉన్నపుడు సర్పంచులు ఏదో విధంగా డబ్బులు సర్దుబాటుచేసి పనులు ఆగకుండా చూసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సర్పంచుల పదవీకాలం పూర్తికావడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 2 నుంచి పంచాయతీల్లో ప్రత్యేక పాలన ప్రారభమైంది. కొన్ని చోట్ల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పనులు నిలిచిపోకుండా ఉండేందుకు డబ్బులు సర్దుబాటు చేసినప్పటికీ.. నెలల తరబడి పంచాయతీలను ఎలా నిర్వహించాలన్న దానిపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా ప్రత్యేక అధికారుల పాలనలో రావని, మళ్లీ పంచాయతీల పాలకవర్గాలను ఎన్నుకొన్న తర్వాతే కేంద్రం నిధులు వస్తాయని పంచాయతీరాజ్ శాఖకు చెందిన అధికారి ఒకరు తెలిపారు. గతంలో ఎస్ఎఫసీ నిధులు రాకున్నా.. కేంద్రం ఇచ్చే నిధుల ద్వారా పాలకవర్గాలు గ్రామ పంచాయతీలను నెట్టుకువచ్చాయి. ఇప్పుడు రాష్ట్రం, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఏవీ రాకపోవడంతో ఆదాయ వనరుల్లేని గ్రామాల పరిస్థితి దయనీయంగా మారింది.

కల్పించింది. వీరు విద్యుత్ లైట్లు, పారిశుద్ధ్యం, మురుగు కాల్వల్లో పూడిక తొలగింపు, చెత్త ట్రాక్టర్ నడిపించడం, మంచినీటి సరఫరా వంటి పనులు చేయాల్సి ఉంటుంది. వీరికి మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు.




**వేతనాల కోసం కార్మికుల ఒత్తిడి**

గ్రామ పంచాయతీల్లో నిధుల్లేక చాలా చోట్ల సిబ్బందికి వేతనాలు చెల్లించడం లేదు. ఫలితంగా కార్మికులు పనులు చేయడం లేదు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో ప్రతి 500 మంది జనాభాకు ఒక మల్టీపర్పస్ కార్మికుడిని నియమించే అవకాశం

ఇక, మేజర్ పంచాయతీల్లో అవసరమైనంత సంఖ్యలో పారిశుద్ధ్య సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పనులు నిలిచిపోకుండా ఉండేందుకు ప్రత్యేకంగా కూలీలను నియమించుకుంటే.. వారికి డబ్బులు చెల్లించడం కష్టంగా ఉంటోందని, ఇప్పటికే బకాయి వేతనాల కోసం కార్మికులు తమపై ఒత్తిడి తెస్తున్నారని ప్రత్యేకాధికారులు చెబుతున్నారు.

**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.